ఘనంగా ఒలింపిక్ డే రన్

క్రీడాజ్యోతితో ర్యాలీ 2కే రన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఐ రామ్‌లాల్

మక్తల్, జూన్ 22 : తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఆదివారం మక్తల్ పట్టణంలో వందలాది మంది క్రీడాకారులచే ఒలింపిక్ డే రన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలం అన్నారు. జూన్ 23 వ తేదీన ప్రపంచ ఒలింపిక్ డే సందర్భంగా ఆదివారం మక్తల్ పట్టణంలో ర్యాలీని చేపట్టామన్నారు. ఈ ర్యాలీని మక్తల్ సీఐ రాంలాల్ క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. వేలాది మంది క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యంతో గోపాలం గ్రామీణ ప్రాంతాల్లోని యువకులకు క్రీడా మెలుకోహేలను నేర్పిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడం ఎంతో విషయమని సీఐ రాంలాల్ అన్నారు. అనంతరం సైకిల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలం మాట్లాడుతూ 2025 ఒలింపిక్ డే థీమ్, లెట్స్ మూవ్, వన్ ఇండియా ఒలింపిక్స్ పూర్తి మూడు విలువలను గురించి తెలుపుతుందని సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తులో ఉన్నతమైన శిఖరాలకు చేరుకునే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి, క్రీడల అధికారి వెంకటేశ్ శెట్టి, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్య ఆంజనేయులు, మాజీ జెడ్పీటీసీ లక్ష్మిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్, నాయకులు సురేశ్, ఆంజనేయులు, మీనాకుమారి, దీప, అమ్రేశ్, రమేశ్, జగదీశ్, మంజుల, వెంకటేశ్, బాలమని, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

నారాయణపేట, జూన్ 22 : ఇంటర్నేషనల్ ఒలింపిక్ డే ను పురస్కరించుకొని సోమవారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో నారాయణపేట రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకటేశ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యేల పరామర్శ

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం

మాగనూరు, జూన్ 22 : మండలంలోని వడ్వాట్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు సర్దార్ నర్సింహులు భార్య శివమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆదివారం వడ్వాట్ గ్రామానికి చేరుకొని శివమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శివమ్మ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ఎల్ఐసీ అశోక్ భార్య లలిత ఇటీవల బైక్‌పై నుంచి కిందపడి తలకు బలమైన గాయాలు కాగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందగా లలితమ్మ పార్థివ దేహానికి కూడా పూలమాల నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచ్ నర్సింహులు, మాజీ ఎంపీటీసీ సుదర్శన్ గౌడ్, సమరసింహారెడ్డి, బసంతిరెడ్డి, ఈశ్వర్ ఉన్నారు.

జడ్చర్లలో..

కౌన్సిలర్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి

జడ్చర్లటౌన్, జూన్ 22 : మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆలూరి శశికిరణ్ తండ్రి భీంరాజ్ గుండెపోటుతో మృతి చెందడు. విషయం తెలుసుకున్న జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి ఆదివారం కౌన్సిలర్ శశికిరణ్ ఇంటికి చేరుకొని భీంరాజ్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా 23వ వార్డులో ఏపీజీవీబీ రిటైర్డ్ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆదివారం శ్రీకాంత్ కుటుంబసభ్యులను కలిసి పరామర్శించారు. ఆయన వెంట మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, బీఆర్ఎస్ నాయకులు మురళి, ప్రణీల్ చందర్, శంకర్‌నాయక్, శ్రీకాంత్, నాగిరెడ్డి, కౌన్సిలర్లు ఉన్నారు.

రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు ఎంపిక

కిక్ బాక్సింగ్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 22 : జిల్లా కేంద్రంలోని పాలమూల్ గ్రామర్ స్కూల్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు ఎంపికలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 100 మంది క్రీడాకారులు పాల్గొనగా వెయిట్, ఏజ్ కేటగిరి తోపాటు పోటీలో ప్రతిభ కనబర్చిన 40 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్‌పోటీలకు ఎంపికైనట్లు అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి రవినాయక్ తెలిపారు. అంతకు ముందు ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి వెంకటేశ్, కురుమూర్తి హాజరై కిక్‌బాక్సింగ్ పోటీలను ప్రారంభించారు.

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

జడ్చర్లటౌన్, జూన్ 22 : మున్సిపాలిటీ పరిధిలోని నాగసాల గ్రామానికి చెందిన యాదిరెడ్డి(60) అదృశ్యమైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ కథనం మేరకు నాగసాలకు చెందిన యాదిరెడ్డి ఈనెల 21వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం గాలించిన ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం అతని భార్య హైమావతి జడ్చర్ల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు.

క్రీడాకారుడికి మంత్రి అభినందనలు

క్రీడాకారుని అభినందిస్తున్న మంత్రి శ్రీహరి

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 22 : ఆసియా బీచ్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ క్రీడాకారుడు ఆసిపుల్లాబేగ్‌ను ఆదివారం క్రీడా శాఖ మంత్రి శ్రీహరి అభినందించారు. మస్కట్‌లోని ఒమన్‌లో మే 5 నుంచి 16వ తేదీ వరకు జరిగిన 10వ ఆసియా పురుషుల బీచ్ హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్‌లో ఆసిఫుల్లాబేగ్ భారతదేశం తరపున ఆసియా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగా మంత్రి శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జియా వ్యూడ్, బాలరాజ్, రవికుమార్, రఘు పాల్గొన్నారు.

గిరిజన మినీగురుకుల పాఠశాలలో కలెక్టర్ తనిఖీ

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

జడ్చర్ల, జూన్ 22 : జడ్చర్ల మండలంలోని కొత్తతండా సమీపంలోని గిరిజన మినీ గురుకుల పాఠశాలను ఆదివారం మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలోని వంటగది, డైనింగ్, స్టోర్‌రూం, పరిసరాలను, భోజనం మెనూను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఆమె మాట్లాడి వారితో ఇంగ్లీషు అక్షరమాల, పాఠ్యాంశాలు చదివించారు. అదేవిధంగా భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గిరిజ ఉన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 22 : పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం ఎనుగొండలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, మహబూబ్‌నగర్, దేవరకద్ర ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించేలా కృషిచేసిన ఉపాధ్యాయులను, కష్టపడి ఇష్టంగా చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మదన్‌మోహన్ యాదవ్, సుధాకర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, విద్యా శాఖసీఎంవో బాలుయాదవ్ ఉన్నారు.

'జీవితాలు నాశనమవుతాయి'

మహబూబ్‌నగర్, జూన్ 22 : మాదక ద్రవ్యాలు (డగ్స్) తీసుకోవడంతో యువత జీవితాలు నాశనమవుతాయని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ అరుణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నషాముక్త్ భారత్ అభియాన్ మాదకద్రవ్య దుర్వినియోగం, జూన్ 26వ తేదీన ఆక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్‌లో పార్మసీ కాలేజీలో ఆవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ, రష్మితలు మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడంతో వచ్చే సమస్యలపై అవగాహన కల్పించారు.

విద్యార్థులు ప్రతిభను కనబరచాలి

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

గౌతమిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్, జూన్ 22 : విద్యార్థులు ప్రతిభను కనబరచాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబరిచినప్పుడే ఉపాధ్యాయులకు గర్వకారణంగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ఉషారాణి, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, రాష్ట్ర మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు రేవతి, జీహెచ్ఎం ఆనందమ్మ, నాయకులు సాయిరాంగౌడ్, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజల మననలు పొందాలి

దేవరకద్ర, జూన్ 22 : ప్రభుత్వ ఉద్యోగస్తులు పనిచేసే ప్రదేశంలో ప్రజల మననలు పొందాలని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. మండలంలోని దోకూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో తెలుగు పండిట్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న దమయంతి ఉద్యోగ విరమణ పొందడంతో ఆదివారం మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్‌లో సన్మాన సభను ఏర్పాటు చేశారు. అనంతరం వివిధ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో బలరాం, హర్షవర్ధన్ రెడ్డి, అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

జడ్చర్ల, జూన్ 22: దేశవ్యాప్తంగా జూలై 9వ తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం జడ్చర్లలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను వేగవంతంగా అమలు చేయాలని భావిస్తుందన్నారు. అందులో భాగంగానే కార్మిక వర్గం పోరాటం చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసిన నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయాలని వేగవంతం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రైవేటీకరణకు అప్పగించి కార్పొరేట్ పెట్టుబడిదారులకు అప్పగించి పెట్టుబడిదారులకు ప్రయోజనం కలిగించే విధంగా లేబర్ కోడ్లలో వారికి అనుకూలంగా చట్టాలను మార్చడం జరుగుతుందని తెలిపారు. దీనిని వ్యతిరేకిస్తు జూలై 9న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను నిర్వహించడం జరుగుతుందని అందులో కార్మికలోకం అంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్, కార్యదర్శి కురుమూర్తి, తెలుగు సత్తయ్య, చంద్రకాంత్, రాజ్‌కుమార్, కురుమూర్తి, కొమరలి ఉన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

- సహకార గృహ నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 22 : నాలుగో తరగతి ఉద్యోగుల సంక్షేమమే నూతన కార్యవర్గ ధ్యేయమని నాలుగో తరగతి ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించిన సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్, మహబూబ్‌నగర్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికల్లో అధ్యక్షుడుగా విజయం సాధించిన అనంతరం మాట్లాడారు. ఆర్థిక పరపతి రంగాల్లో సహకార వ్యవస్థ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగులకు వివిధ పరిష్కార మార్గాలు చూపనుందన్నారు. నూతన కార్యవర్గాన్ని కలెక్టరేట్ ఏవో శంకర్, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, మహబూబ్‌నగర్ అర్బన్ మండలం డిప్యూటీ తాసీల్దార్ దేవేందర్ కేసీరెడ్డి, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు అభినందించారు. అనంతరం ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల కోఆపరేటివ్ హౌజ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్, మహబూబ్‌నగర్ జిల్లా ఎన్నికలకు జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజశేఖర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షుడుగా నరేందర్, ఉపాధ్యక్షుడుగా రఘురాం, కార్యదర్శిగా తిరుమలగిరి రామకృష్ణ, కోశాధికారిగా రాజశేఖర్, డైరెక్టర్లుగా ఎల్లమ్మ, అన్న పుణ్ణ, భాగ్యలక్ష్మి, మౌనిక, రాజు, కార్యవర్గ సభ్యులుగా అన్నపూర్ణ, ఎల్లమ్మ, మౌనిక, తిరుమల రామకృష్ణ, నరేందర్, భాగ్యలక్ష్మి, రఘురాం, రాజశేఖర్, రాజును ఎన్నుకున్నారు. ఈ సంఘం కాలపరిమితి ఐదు సంవత్సరాలు ఉంటుందని ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

అన్ని విధాలుగా అండగా ఉంటాం

నివాళులర్పిస్తున్న ప్రెస్ క్లబ్ సభ్యులు

మహబూబ్‌నగర్, జూన్ 22 : జర్నలిస్టు నర్సింహులు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని బాధిత కుటుంబ సభ్యులకు ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు చెప్పారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందిన జర్నలిస్టు నర్సింహులు ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రోడ్డు ప్రమాదంలో జర్నలిస్టు మరణించడం భాధాకరమని మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రెస్ క్లబ్ తరుపున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేందర్‌చారీ, ప్రధాన కార్యదర్శి నరేందర్ గౌడ్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్, సతీశ్, మణిప్ర సాబ్, కోశాధికారి యాదయ్య, ఈసీ సభ్యులు మోహన్‌దాస్, రవికుమార్, రామకోండ, రమణ, డెస్క్ జర్నలిస్టు సాయికుమార్ ఉన్నారు.

లింగంపల్లిలో అర్ధాంతరంగా నిలిచిపోయిన పాఠశాల అదనపు తరగతి గదులు.

బీఆర్ఎస్ హయాంలో మంజూరైనా
పనులకు మంగళం

- లింగంపల్లిలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు
- రూ.1.50కోట్ల పనులకు తిలోదకాలు
- 70 శాతం పనులు గతంలోనే పూర్తి
- బిల్లులు చేయక.. పనులు పూర్తి కాక అవస్థలు
- కన్నెత్తి చూడని పాలకులు, అధికారులు
- కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించాలని గ్రామస్తుల ఆవేదన

నవాబ్‌పేట, జూన్ 22 : మండలంలోని లింగంపల్లి గ్రామంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన వివిధ అభివృద్ధి పనులకు.. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలోనే 70శాతం పనులు పూర్తి చేసినా.. ఆ పనులకు నేటికీ బిల్లులు అందక.. మిగిలిన పనులు పూర్తికాక పోవడంతో.. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు తీవ్ర మైన ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతుండగా.. గ్రామ అభివృద్ధి కూడ కుంటుపడి పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా నూతన ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచి పోయినా.. అర్ధాంతరంగా ఆగిపోయిన పనులపై దృష్టి సారించక పోవడం విడ్డూరం. ఇందుకు సంబంధించిన వివరాలలోకి వెళ్తే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నాటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక కృషితో లింగంపల్లి గ్రామానికి వివిధ అభివృద్ధి పనుల నిమిత్తమై సుమారుగా రూ.కోటి 50లక్షలు మంజూరయ్యాయి. రూ.85లక్షలతో ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణం, రూ.10లక్షలతో బీసీ కమ్యూనిటీ హాలు, రూ.20లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రూ.15లక్షలతో మహిళా సంఘం భవనం, రూ.20లక్షలతో గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అదే గ్రామానికి చెందిన అప్పటి జెడ్పీటీసీ సభ్యులు రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శీనయ్య తదితర నాయకులు వారి సొంత గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అప్పట్లోనే సుమారుగా 70శాతం పనులు పూర్తి చేశారు. భవన నిర్మాణాలకు చెత్తులు వేసి గోడలు కూడా నిర్మించారు. అంతలోనే నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఈ అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. నాటి నుంచి నేటి వరకు చేపట్టిన పనులకు నయా పైసా బిల్లులు కూడా చెల్లింకపోవడమే కాకుండా.. మిగిలిన 30శాతం పనులను కూడా చేపట్టలేదు. ఈ పనుల విషయంలో నేటి వరకు కూడా సంబంధిత అధికారులు సైతం అక్కడ కన్నెత్తి చూడక పోవడం విడ్డూరంగా ఉంది. ప్రభుత్వాలు వస్తుంటాయి.. పోతుంటాయి.. కానీ అభివృద్ధి పనులు మాత్రం పూర్తి చేయించాలి.. కదా అంటూ గ్రామ ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉంది. అలాగే విద్యార్థులకు తరగతి గదులు చాలక అవస్థలు పడుతున్నారు. హెల్త్ సెంటర్ లేక గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని గత పాలకులు అభివృద్ధి పనులను మంజూరు చేసి.. పనులు చేయిస్తే వాటికి బిల్లులు ఇవ్వకుండా.. పనులు చెయ్యకుండా దాటవేత ధోరణి అవలంభించడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు నిలదీస్తున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి స్పందించి పనులు పూర్తి చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వర్ రెడ్డిని వివరణ కోరగా.. కొన్ని పనులకు ఎంబీ రికార్డు చేశాం.. కానీ ప్రభుత్వం నుంచి డబ్బులు రాకపోవడంతో వారి ఖాతాల్లో పడలేదు. డబ్బులు రిలీజ్ అయిన వెంటనే డబ్బులు వారి ఖాతాల్లో పడతాయన్నారు. మిగిలిన పనులకు ఎంబీ రికార్డు చేయాల్సి ఉందన్నారు.

నిలిచిపోయిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పనులు

సేవాభావంతోనే నిరంతర లాభాలు

సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ కండె కుమారస్వామి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 22 : క్రమశిక్షణ, సామాజిక సేవా భావంతో ముందుకు సాగుతుండటంతోనే నిరంతర లాభాలను పాలమూరు అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు ఆర్జిస్తుందని ఆ బ్యాంకు చైర్మన్ కండె కుమారస్వామి అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆ బ్యాంక్ 27వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్యాంకు 1998 జూన్ 7వ తేదీన రూ.50లక్షల మూల ధనంతో ప్రారంభించారని ప్రస్తుతం రూ.3.40కోట్లు మూలధనంతో ఉందన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఎన్నో బ్యాంకులు, వివిధ రకాల సంస్థలు మూతబడినా.. పాలమూరు బ్యాంకు ఉమ్మడి జిల్లాలో ఒక ఐకాన్‌గా నిలిచిందన్నారు. వినియోగదారులకు మరిన్ని సౌకర్యాలను కల్పించడానికి మొబైల్ బ్యాంకింగ్‌కు సంబంధించి ఆర్‌బీఐ నుంచి ఆమోదం పొందామని, ఈ సంవత్సరం డిజిటల్ ఉత్పత్తులను మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ చెల్లింపులను ప్రవేశ పెట్టేందుకు అవసర మైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన డీసీవో శంకరాచారి మాట్లాడుతూ సక్సెస్‌కు మారుపేరు పాలమూరు అర్బన్ బ్యాంక్ అని, కస్టమర్లకు మంచి సేవలను అందిస్తున్నందుకు బ్యాంకు అధికారులు, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో సీనియర్ వైస్ చైర్మన్ సీఏ కృష్ణయ్య, వైస్ చైర్మన్ సూర్యనారాయణ, డైరెక్టర్లు శ్రీనివాస్, రామ్మోహన్, తిరుపతయ్య, తమ్మయ్య, కన్నయ్యశెట్టి, సంగమేశ్వర్, నగేశ్, రమణ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జడ్చర్లటౌన్, జూన్ 22 : జడ్చర్ల పట్టణంలోని నిమ్మబావిగడ్డ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయపడిన ఎండీ రవూఫ్(47) హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం తిమ్మాజీపేట మండలం గొరిట గ్రామానికి చెందిన రవూఫ్ జడ్చర్ల మండలం ఉదండాపూర్ ప్రాజెక్టు వద్ద పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 21వ తేదీ రాత్రి డ్యూటీ ముగించుకొని అతను బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. పట్టణంలోని నిమ్మబావిగడ్డ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న లారీని బైక్ ఢీకొన్నది. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న రవూఫ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గుర్తించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు. అతని పరిస్థితి విషమకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం అతడిని హైదరాబాద్ ఉస్మానియా దవాఖానకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ రవూఫ్ మృతిచెందాడని మృతుడి కుటుంబసభ్యులు ఆదివారం జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

కంటి అద్దాల పంపిణీ

భూత్పూర్, జూన్ 22 : మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపుర్‌లో ఆర్ఎస్ఎస్ సంస్థ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి అయ్యాయిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం పేద ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించి అద్దాలను పంపిణీ చేసినట్లు ఆర్ఎస్ఎస్ జిల్లా సంచాలకుడు వసంతం వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంకుమార్, సభ్యులు బలరాం, భరతయ్య, మహానంది, శ్రీనివాసులు, వెంకటేష్, భాస్కర్, చెన్నగౌడ్ పాల్గొన్నారు.

యువకుడిపై దాష్టీకం

- గదిలో బంధించి మూకుమ్మడి దాడి

నవాబ్‌పేట, జూన్ 22 : మండలంలోని కొల్లూరు గ్రామానికి చెందిన పట్నం వేణుగోపాల్‌పై అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు గదిలో బంధించి మూకుమ్మడి దాడి చేసిన